ప్రజారంజక బడ్జెట్‌

ఎమ్మెల్యే గాంధీ



గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌ ప్రజారంజక బడ్జెట్‌గా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అభివర్ణించారు. బడ్జెట్‌పై ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. ప్రజల ఆకాంక్షలు, రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమం దృష్ట్యా రూపొందించిన బడ్జెట్‌ అని అన్నారు. ఆరు గ్యారెంటీలకు హామీ పత్రం రాష్ట్రాభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందని హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌ నగర అభివృద్ధికి రూ.10వేల కోట్లను కేటాయించడం నగర అభివృద్ధి పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి స్పష్టమైందన్నారు. ఆరోగ్యశ్రీ కింద పది లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామని ప్రభుత్వం స్పష్టంగా చెప్పిందని, ఆరోగ్యశ్రీలో ఉన్న 1,672 చికిత్సలలో 1,375 చికిత్సలకు ప్యాకేజీ ధరలను సగటున 20 శాతానికి పెంచారని గుర్తు చేశారు. అంతేకాకుండా ఇందులో 163 వ్యాధులను కొత్తగా చేర్చారన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి డిజిటల్‌ హెల్త్‌ ప్రొఫైల్‌ కార్డును జారీ చేసే విధానాన్ని ప్రవేశ పెట్టనున్నారని ఆయన గుర్తుచేశారు. జీహెచ్‌ఎంసీ మౌలిక వసతులకు రూ.3,065 కోట్లు, హెచ్‌ఎండీఏలో మౌలిక వసతులకు రూ.500 కోట్లు కేటాయించారన్నారు. మెట్రో వాటర్‌ వర్క్స్‌కు రూ.3,385 కోట్లు, హైడ్రా సంస్థకు రూ.200 కోట్లను కేటాయించారన్నారు.సీఎం రేవంత్‌ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో తీసుకెళ్లటానికి రూపొందించిన బడ్జెట్‌ అని ఆయన వివరించారు.







మాదాపూర్‌లో అధ్వానంగా తయారైన రోడ్డు

అస్తవ్యస్తం..

ఎడతెరిపి లేని వర్షం.. రోడ్లు బురదమయం



మాదాపూర్‌లో ట్రాఫిక్‌ను కంట్రోల్‌ చేస్తున్న సిబ్బంది

మాదాపూర్‌: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు బాగాలేకపోవడంతో బురదమయంగా మారి వాహనదారులు జారిపడుతున్నారు. ఇక రోడ్లపై వాహనాలు ఆగిపోతే ట్రాఫిక్‌ సిబ్బంది సాయపడుతున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అత్యవసరం అయితేనే బయటికి రావాలని ట్రాఫిక్‌ అధికారులు చెబుతున్నారు. మాదాపూర్‌లో ప్రధానంగా నెక్టార్‌ గార్డెన్, సిటీ వైన్స్, శిల్పారామం, ఎన్‌ఐఏ రోడ్‌ వద్ద వాటర్‌ లాగింగ్‌ పాయింట్లు ఉన్నాయి. కాగా ఐటీ కారిడార్‌ ఎప్పుడూ రద్దీగా ఉండే ప్రాంతం. ఇంటి నుంచి కార్యాలయానికి రావాలంటే గంటల సమయం పడుతుందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు గుంతల రోడ్లతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వాపోతున్నారు. వర్షాకాలం దృష్ట్యా వాహనదారులు ఇంటి నుంచి గంట ముందే బయలుదేరాలని, వాహనాల కండిషన్‌ను సరిచూసుకోవాలని మాదాపూర్‌ ట్రాఫిక్‌ సీఐ నర్సయ్య సూచించారు. వాహనాల కండిషన్‌ బాగా లేకపోతే రోడ్డుపై ఆగిపోతాయని ట్రాఫిక్‌ సమస్య మరింత జఠిలం అవుతుందన్నారు. ఇక తొందరగా గమ్యస్థానానికి చేరుకోవాలనే ఆతృతలో కొందరు రోడ్డుకు అడ్డంగా.. ట్రాఫిక్‌ నిబంధనలకు విరుద్ధంగా వెళుతున్నారని దీని వల్ల ప్రమాదాలకు గురవుతారన్నారు.ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌రూల్స్‌ పాటించాలన్నారు. రాంగ్‌రూట్‌లో పట్టుబడితే ఫైన్‌లతో పాటు జైలుకు వెళతారని హెచ్చరించారు.

వాహనాలు చెడిపోతున్నాయి..

రోడ్లు అస్తవ్యస్తంగా ఉండడంతో ఇంటికి వెళ్లాలంటే గంటల సమయం పడుతుంది. వాహనాలు తొందరగా పాడవుతున్నాయి. రోడ్లపై జారి పడుతున్నారు. వచ్చే జీతం కంటే వాహనానికి అయ్యే ఖర్చులు ఎక్కువగా ఉన్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయాలి.

-పవన్, స్థానికుడు



సైబర్‌ నేరాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్‌ఐ అక్బర్‌ అలీ

పటాన్‌చెరు టౌన్‌: విద్యార్థులు సైబర్‌ నేరాలతో పాటు షీ టీం సేవలపై అవగాహన కలిగి ఉండాలని పటాన్‌చెరు ఏఎస్‌ఐ అక్బర్‌ అలీ అన్నారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మిషన్‌ శక్తి సంకల్ప్‌- 100 రోజుల ప్రత్యేక కార్యక్రమాలలో భాగంగా గురువారం పెద్దకంజర్ల గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్, అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాలల హక్కులు, షీటీమ్, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, లింగ సమానత్వం, వివక్ష, సఖి సర్వీసెస్, చైల్డ్‌ లైన్‌ సేవలు, సైబర్‌ నేరాలు, పిల్లల అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల నివారణ, ఆరోగ్యం, పోషకాహారం, హెల్ప్‌ లైన్‌ నంబర్లు (1098, 100, 181,112,1930) పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీ టీమ్‌ హెడ్‌ కానిస్టేబుల్‌ శివకుమార్, ముంతాజ్, పంచాయతీ సెక్రటరీ అనిత, పాఠశాల హెచ్‌ఎం విద్యాసాగర్‌ రెడ్డి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి మండల పరిధిలోని వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ డివిజన్‌ల పరిధిలోని పలువురికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ పథకంలో 28 మంది లబ్ధిదారులకు మంజూరైన 28,03,248 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాస్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ మంజూరు పత్రాలు అందజేత

ఆల్విన్‌కాలనీ: డివిజన్‌ పరిధిలోని చంద్రమ్మ కాలనీకి చెందిన తన్నీరు మధుకు వైద్యచికిత్స నిమిత్తం మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు పత్రాలను అతని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే గురువారం అందజేశారు. 2,50,000 లక్షల యాభైవేల రూపాయల ఎల్‌ఓసీ పత్రాలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు గుమ్మడి శ్రీనివాస్, రాజేష్‌ చంద్ర, కృష్ణారావు, కొండారెడ్డి పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకుంటే ఉద్యమిస్తాం

పటాన్‌చెరు టౌన్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ఉద్యమిస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు వీరేశం అన్నారు. గురువారం పటాన్‌చెరు మండలం బచ్చుగూడెం చౌరస్తా సమీపంలోని ప్రైవేట్‌ ఫంక్షన్‌ హాల్‌లో పార్టీ మండల శాఖ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు వీరేశం మాట్లాడుతూ... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయా గ్రామాల పార్టీ సభ్యుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కిసాన్‌ మోర్చా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు అల్లం రాజారెడ్డి, నాయకులు ప్రభాకర్‌ రెడ్డి, కార్యదర్శి సాయి ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ధనుంజయ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి

జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌రెడ్డి



శిల్పారామం-కొత్తగూడ రోడ్డులో మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న జెడ్సీ ఉపేందర్‌ రెడ్డి

గచ్చిబౌలి: వర్షాకాలం నేపథ్యంలో పరిసరాల శుభ్రతపై క్షేత్రస్థాయి సిబ్బంది పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి వెస్ట్‌ జోనల్‌ కమిషనర్‌ పి.ఉపేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం వెస్ట్‌ జోనల్‌ పరిధిలో గచ్చిబౌలి, బయోడైవర్సిటీ, కొత్తగూడ జంక్షన్, హైటెక్స్‌ రోడ్డు, శిల్పారామం రోడ్డు, రోడ్‌ నంబర్‌ 45 తదితర ప్రాంతాలలో ఆయన పర్యటించారు. వరద నీరు నిలిచే ప్రాంతాలను, కొత్తగా అమర్చిన మ్యాన్‌హోళ్లను, సెంట్రల్‌ మీడియన్‌లోని గ్రీనరీ, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఐటీ కారిడార్‌లోని ప్రధాన రహదారుల మధ్య గ్రీనరీని మరింత పెంపొందించాలన్నారు. ప్రధాన కూడళ్ల పరిశుభ్రతకు కేరాఫ్‌కు ఉండాలని సూచించారు. రోడ్లపై, కాలనీలలో మురుగు నీరు నిల్వకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రహదారుల పక్కన పేరుకుపోయిన చెత్త కుప్పలు, మట్టి దిబ్బలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో వెస్ట్‌ జోనల్‌ ఎస్‌ఈ శంకర్, విక్రం, ఈఈ శ్రీనివాస్, డీఈ శిరీష, ఏఎంఓహెచ్‌ నగేష్‌ తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగింపు



బుధవారం నానక్‌రాంగూడలో పేరుకపోయిన చెత్త (ఫైల్‌)



గురువారం చెత్తను తొలగించిన దృశ్యం

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని రేషన్‌షాపు పరిసరాల్లోని చెత్తను గురువారం తొలగించారు. ఈ ప్రాంతంలో చెత్త పేరుకపోవడమే కాకుండా చనిపోయిన ఎలుకలు, పిల్లి మృతదేహాలతో దుర్వాసన వచ్చేది. దీంతో స్థానికుల ఫిర్యాదుతో 'సాక్షి' దినపత్రికలో 'చెత్తతో నిత్యం ఇబ్బందులే' శీర్షికన ప్రచురితమైన వార్తకు శానిటేషన్‌ అధికారులు స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్ట్‌

గచ్చిబౌలి: తలపై సుత్తితో మోది కూలీని హత్య చేసిన నిందితుడిని అరెస్ట్‌ చేసినట్లు గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్‌ ఎస్‌.ఆంజనేయులు తెలిపారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన వలసకూలి రాజ్‌కుమార్‌(44) వట్టినాగులపల్లిలో అద్దె ఇంట్లో హత్యకు గురైన విషయం తెలిసిందే. పెయింటింగ్‌ పనుల కోసం ఉత్తరప్రదేశ్‌ నుంచి తన వెంట తీసుకొచ్చిన మరో వలస కూలి రాంసింగ్‌(54) హత్యకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. మంగళవారం రాత్రి రాజ్‌కుమార్‌తో కలిసి తోటి కూలీలంతా మద్యం తాగారు. ఆ సమయంలో రెండు నెలలుగా కూలీ డబ్బులు ఇవ్వడం లేదని రాంసింగ్‌తో గొడవకు దిగాడు. మిగతా వాళ్లు ఇద్దరికి సర్ది చెప్పడంతో రాజ్‌కుమార్‌ వరండాలో నిద్రకు ఉపక్రమించాడు. గాఢ నిద్రలో ఉన్న సమయంలో రాంసింగ్‌ సుత్తితో తలపై మోదడం తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు రాంసింగ్‌ హత్య చేసినట్లుగా ఆధారాలు సేకరించి గురువారం అరెస్ట్‌ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 60, పచ్చిమిర్చి 60, బెండ 40, కాకర 50, దొండ 40, దోస 40, ఆలు 40, చామ 60, కీర 35, బీర 40, వంకాయ 40, గోకర 50, బీన్స్‌ 80, బీట్‌రూట్‌ 40, క్యాప్సికమ్‌ 60, క్యాబేజీ 40, క్యారెట్‌ 60, చిక్కుడు 90, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (1)10 , క్యాలీఫ్లవర్‌ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 200, వెల్లుల్లి 280.

బోనాల జాతర

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం గ్రామంలో గురువారం పోచమ్మ తల్లి బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలు సమర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి ఉత్సవాలకు హాజరయ్యారు. అలాగే జిన్నారం మండలంలోని సోలక్‌పల్లి గ్రామంలో బోనాల జాతర జరిగింది.

విద్యుత్‌ షాక్‌తో వ్యక్తి మృతి

మియాపూర్‌: విద్యుత్‌ షాక్‌తో వ్యక్తి మృతిచెందిన సంఘటన మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రామలింగప్రసాద్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా ముదిగొండకు చెందిన రాయబారపు ఉపేంద్ర(32) బతుకుదెరువుకోసం కుటుంబంతో నెల రోజుల కిందట నగరానికి వచ్చి మియాపూర్‌ రాజారాం కాలనీలో నిర్మాణంలో ఉన్న భవనంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం భార్య శిరీష ఇళ్లలో పనికి వెళ్లింది. ఉపేంద్ర ఉదయ 9.30 గంటలకు రోజు మాదిరిగానే నిర్మాణంలో ఉన్న భవనంలో నీటి మోటార్‌ ఆన్‌చేసి భవనానికి నీరు పెడుతుండగా నీటి పైప్‌ ఊడిపోయింది ఉపేంద్ర సెల్లార్లోకి వెళ్లి మోటర్‌ ఆఫ్‌ చేయకుండా ఊడిపోయిన పైప్‌ను జాయింట్‌ చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్‌ షాక్‌ తగిలింది. కొద్ది సేపటికి స్థానికులు చూసి ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మియాపూర్‌ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



శేరిలింగంపల్లి హైస్కూల్‌లో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన సామల మహేందర్‌రెడ్డి తదితరులు

పీఆర్‌టీయూ టీఎస్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి సామల మహేందర్‌రెడ్డి

శేరిలింగంపల్లి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పీఆర్‌టీయూ టీఎస్‌ ముందుకు సాగుతుందని ఆ యూనియన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి సామల మహేందర్‌ రెడ్డి తెలిపారు. గురువారం శేరిలింగంపల్లి జిల్లా పరిషత్‌ హైస్కూల్‌లో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసులను సాధించడంతో పాటు ఎంఈఓలు, జేఎల్, డైట్‌ లెక్చరర్‌గా ప్రమోషన్‌లను సాధిస్తామన్నారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న 5 డీఏలు, 50 శాతం ఫిట్‌మెంట్‌ మంజూరుకు కృషి చేస్తామన్నారు. పాత పెన్షన్‌ విధానంను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. మండల పరిధిలోని లింగంపల్లి, ఖాజాగూడ జడ్పీహెచ్‌ఎస్‌లతో పాటు యూపీఎస్‌ నానక్‌రాంగూడ, ప్రైమరీ స్కూల్స్‌ ఖాజాగూడ, లింగంపల్లిలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్‌ మాసపత్రిక సంపాదకవర్గ సభ్యులు కృష్ణారెడ్డి, యూనియన్‌ మండల అధ్యక్షులు హనుమంత్, యూనియన్‌ రాష్ట్ర నాయకులు శివరాజు, నరహరి, చంద్రశేఖర్, యూనియన్‌ నాయకులు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నీటి కనెక్షన్లు తొలగించాలి

ఆల్విన్‌కాలనీ: అక్రమ మంచినీటి కనెక్షన్లను తొలగించాలని కోరుతూ బీజేవైఎం నాయకులు గురువారం వాటర్‌ వర్క్స్‌ డీజీఎం నాగప్రియకు వినతిప్రతం అందించారు. అనంతరం ఆల్విన్‌ కాలనీ డివిజన్‌ పీజేఆర్‌నగర్‌ కాలనీలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్‌ యాదవ్, అధ్యక్షులు కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీనియర్‌ నాయకులు కేశవరావు తదితరులు బస్తీలో పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లమ్మబండ, పీజేఆర్‌ నగర్, ఎన్‌టీఆర్‌నగర్, దత్తాత్రేయ కాలనీ తదితర కాలనీల్లో కాసులకి కక్కుర్తి పడి వాటర్‌ వర్క్స్‌ సిబ్బంది అక్రమ నీటి కనెక్షన్లను ఇవ్వటం వల్ల అందరికీ సరిపడా నీరు రాక ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే అక్రమ కనెక్షన్లను తొలగించాలని కోరామని తెలిపారు. భవిష్యత్‌లో ఇటువంటివి పునరావృతం కాకుండా సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగాబస్తీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను వివరించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. మురుగుతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు రాజు, శ్రీనివాస్, రఘు, శివాజీ, కవిత, అనిత, సురేష్, రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు చిత్రప్రదర్శన

మాదాపూర్‌: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ ఆర్ట్‌గ్యాలరీలో వాయిస్‌ ఆఫ్‌ ది వేవ్స్‌ పేరిట చిత్ర ప్రదర్శనను శుక్రవారం ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో కళాకారిణి రమణి మైలవరపు వేసిన చిత్రాల ప్రదర్శనతో పాటు లైవ్‌ షో ఉంటుందని తెలిపారు. ఈ ప్రదర్శన ఉదయం 11గంటల నుంచి రాత్రి 7గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది.


విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి




యూనిఫాం, నోట్‌బుక్స్‌ పంపిణీ చేసిన రవీందర్‌గౌడ్‌, పాఠశాల సిబ్బంది

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉపాధ్యాయులు మెరుగైన విద్యను అందించాలని జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్‌ సూచించారు. రవీందర్‌గౌడ్‌ ఆధ్వర్యంలో మండలంలోని శివానగర్‌ గ్రామంలో గురువారం విద్యార్థులకు యూనిఫాం, నోటుపుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రవీందర్‌గౌడ్‌ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, వడ్డె కృష్ణ, రాజుగౌడ్, మహేష్, సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్లపైనే వ్యర్థాలు





రాయదుర్గం: నానక్‌రాంగూడలోని మురుగు కాలువలు, మ్యాన్‌హోళ్లలో పేరుకుపోయిన చెత్తను తొలగించి అక్కడే వదిలేస్తున్నారు. వాహనాల రాకపోకలతో ఈ వ్యర్థాల కుప్పలు చెదిరిపోయి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. మ్యాన్‌హోళ్లలో వ్యర్థాలను తొలగించిన వెంటనే వాటిని తరలించేలా చూడాలని స్థానికులు డిమాండ్‌ చేస్తున్నారు.

మెట్రోరైలుకు నిధులు కేటాయింపు.. హర్షం



రామచంద్రాపురం(పటాన్‌చెరు) : మియాపూర్‌ నుంచి రామచంద్రాపురం మీదుగా పటాన్‌చెరు-ఇస్నాపూర్‌ వరకు మెట్రో రైలు పొడిగింపునకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి మియాపూర్‌ నుంచి ఇస్నాపూర్‌ వరకు మెట్రోరైలు పొడిగిస్తామని ప్రకటించిన సంగతి అందరికి తెలిసిందే. కాగా మార్చిలో జాతీయ రహదారిపై మెట్రో రైలు వంతెన నిర్మాణం కోసం భూసార పరీక్షలు సైతం నిర్వహించారు. ప్రస్తుత బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం మెట్రోరైలుకు నిధులు కేటాయించడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతమైన రామచంద్రాపురం, పటాన్‌చెరు, ఇస్నాపూర్‌ ప్రాంతాలనుంచి నిత్యం వేలాది మంది కార్మికులు, విద్యార్థులు, ఉద్యోగస్తులు నగరానికి రాకపోకలు సాగిస్తుంటారు. ట్రాఫిక్‌ సమస్యతో సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోవడం ఇబ్బందిగా ఉంది. అదే మెట్రో రైలు ఉంటే సకాలంలో విధులకు హాజరుకావొచ్చని స్థానికులు తెలిపారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ట్రాఫిక్‌ సమస్య ఉండదు



మెట్రోరైలు రాకతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది. సకాలంలో గమ్యానికి చేరుకోవచ్చు. ట్రాఫిక్‌ సమస్య ఉండదు.

-అంజాద్, విద్యార్థి, రామచంద్రాపురం

సీఎంకు కృతజ్ఞతలు



మెట్రో రైలు పొడిగింపునకు నిధులు కేటాయించడం సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డికి నా కృతజ్ఞతలు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభా అవసరాల కోసం మెట్రో రైలు అవసరం.

-ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి

త్వరగా పనులు ప్రారంభించాలి



మియాపూర్‌ నుంచి ఇస్నాపూర్‌ వరకు మెట్రోరైలు పొడిగింపునకు ప్రభుత్వం నిధులను కేటాయించడం ఆనందంగా ఉంది. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని వెంటనే పనులను ప్రారంభించాలి.

-నాగరాజు యాదవ్, పటాన్‌చెరు

345 సెల్‌ఫోన్ల రికవరీ.. అప్పగింత

రాయదుర్గం: సైబరాబాద్‌ పోలీసులు సమష్టి కృషితో సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. సెంట్రల్‌ ఎక్విప్‌మెంట్‌ ఐడెంటిటీ రిజిస్టర్‌(సీఈఐఆర్‌) పోర్టల్‌ సహాయంతో రికవరీ చేశారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్‌ కమిషనరేట్‌లో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డీసీపీ క్రైమ్స్‌ కె నర్సింహ రికవరీ చేసిన సెల్‌ఫోన్లను యజమానులకు అప్పగించారు. అనంతరం డీసీపీ క్రైమ్స్‌ నర్సింహ మాట్లాడుతూ మొబైల్‌ ఫోన్లు రోజువారీ జీవితంలో చాలా కీలకమైనవని ఫోన్లు పోగొట్టుకున్న వారు తమ మొబైల్‌ వివరాలను సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని సూచించారు. మొబైల్‌ ఫోన్ల రికవరీలో చిత్తశుద్ధితో కృషి చేసిన క్రైమ్స్‌ ఏసీపీ కళింగరావు, ఐటీ సెల్‌ ఇన్‌స్పెక్టర్‌ జగదీశ్వర్‌లను డీసీపీ అభినందించారు.



ఫోన్లు పోగొట్టుకున్న వారికి తిరిగి వారి ఫోన్లను అందజేస్తున్న డీసీపీ క్రైమ్స్‌ నర్సింహ

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462